క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సాయి హోమం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండలంలోని ఆనందపురం గ్రామంలో షిర్డీ సాయి హోమం, పూజా కార్యక్రమాలు గురువారం నిర్వహించారు. 100 అడుగుల ఎత్తుగల వెంకటి సాయికోటి మహాస్థూపం వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి బాబాకు ప్రత్యేక పూజలు చేపట్టారు. పూజ్యగురువుల అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఈ కార్యక్రమాలను చేపట్టామని ఆలయ ధర్మకర్త మక్క వెంకటిసాయి తెలిపారు.

సచివాలయాల్లో ఆధార్ సేవలు



రావాడ ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ ధనుంజయరావు

రణస్థలం: మండలంలోని సంచాం, రావాడ, తెప్పలవలస, పైడిభీమవరం గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు ప్రారంభించడం జరిగిందని ఎంపీడీఓ వి.ధనుంజయరావు తెలిపారు. రావాడ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ మొబైల్ డ్రైవ్‌ను గురువారం తనిఖీ చేశారు. ఐదు ఏళ్లు దాటిన చిన్నారులతో తప్పని సరిగా వేలిముద్రలు వేయించాలని సూచించారు. సరైన ధ్రువపత్రాలు లేకపోతే వయస్సుకు సబంధించి చేర్పులు, మార్పులు చేయవద్దని ఆదేశించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రత్యేక డ్రైవ్ ఉంటుందని, ప్రజలు ఈ ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఇఫ్టూ మహాసభలు విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

రణస్థలం: కార్మికులు ఐక్యంగా పోరాడి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనకు చరమగీతం పాడాలని ఇఫ్టూ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.గణేష్, యూనియన్ ప్రధాన కార్యదర్శి బాసిన లక్ష్మణరావు పిలుపునిచ్చారు. జనవరి 26న శ్రీకాకుళం అంబేడ్కర్ విజ్ఞాన మందిరం ఇలిసిపురంలో జరిగే ఇఫ్టూ జిల్లా ద్వితీయ మహా సభకు కార్మికులు అధిక సంఖ్యలో విచ్చేసి జయప్రదం చేయాలని అన్నారు. పైడిభీమవరం పంచాయతీ చెత్తసేకరణ కేంద్రం వద్ద కార్మికులతో ఇఫ్టూ ద్వితీయ మహాసభల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఇఫ్టూ జిల్లా నాయకులు చిత్తిరి లక్ష్మణరావు, కెల్ల పైడయ్య, రేళ్ల చిన్న తదితరులు పాల్గొన్నారు.


బాధ్యతగా పనిచేయాలి



పెదలింగాలవలస సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లావేరు: సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో పనిచేయాలని ఎంపీడీఓ కె.సురేష్‌కుమార్ అన్నారు. పెదలింగాలవలస, వెంకటాపురం గ్రామాల్లోని సచివాలయాలను గురువారం సందర్శించారు. సచివాలయాల్లో ఉద్యోగుల హాజరును తనిఖీ చేశారు. శాఖల వారిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు, కార్యక్రమాలు అమలు, సచివాలయ ఉద్యోగులు పనితీరుపై సమీక్ష చేశారు. ఆధార్ ప్రత్యేక కార్యక్రమం వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ ఉన్నారు.

షిర్డీసాయికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న ఏపీహెచ్‌బీ కాలనీలో షిర్డీ సాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరంలో స్వామివారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీనివాసశర్మ నేతృత్వంలో కాగడ హారతి, క్షీరాభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి సాయినాథున్ని దర్శించుకున్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి అపూర్వ ఆదరణ



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు నేరుగా చేరవేస్తుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెల్పురాయి గ్రామ సచివాలయ పరిధిలోని వెల్పురాయి, దేవరాపల్లి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. 478 ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయా కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చిన తరువాత అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. దేవరాపల్లిలో కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జేసీఎస్ మండల ఇంచార్జి చిల్ల వెంకటరెడ్డి, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు గురాన మానస, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, బడి రాంబాబు, పైడి శ్రీనివాసరావు, రెడ్డి విశ్వేశ్వరరావు, దేవరాపల్లి సర్పంచ్ మీసాల సరస్వతి, ఎంపీటీసీ గురాన కన్నమ్మ, మీసాల శ్రీనివాసరావు, రమేష్, తవిటినాయుడు, పెద్దింటి వెంకటస్వామి, ఈశ్వరరావు, రామునాయుడు, పిషిణి సంతోషి, తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు యఱ్రవరం సచివాలయ పరిధిలో..

మండలంలోని యఱ్రవరం, కుమ్మరిపేట గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు.

క్యాన్సర్ బాధితురాలికి రూ.లక్ష ఆర్థికసాయం



రూ.లక్ష చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని సంచాం పంచాయతీలో గల పున్నానపాలెం గ్రామానికి చెందిన పున్నాన గీత అనే క్యాన్సర్ బాధితరాలికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్‌ఆర్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష వితరణ చేశారు. చెక్కును మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బాధితురాలు గీతకు గురువారం అందజేశారు. అరబిందో యాజమాన్యానికి పున్నానపాలెం గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. అరబిందో హెచ్ఆర్ అండ్ అడ్మిన్ హెడ్ కె.కమలాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, రెడ్డి రాము తదితరులు ఉన్నారు.

రణస్థలంలో వైఎస్సార్ పొలంబడి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

రణస్థలం: రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం, నాణ్యమైన దిగుబడి పొందేందుకు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలని రణస్థలం వ్యవసాయశాఖ ఏడీఏ వి.శ్రీనివాసరావు సూచించారు. రణస్థలం గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతన్నలతో మెరుగైన వ్యవసాయం చేయించేందుకు ప్రభుత్వం పొలంబడి కార్యక్రమం చేపట్టిందన్నారు. సహజ సిద్ధ వనరులతో సాగు చేయుటం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం, వానపాములు, సేంద్రియ ఎరువులు వాడకం వల్ల లాభాలు వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. సమగ్ర పంటల యాజమాన్య పద్ధతులు, మొక్కజొన్నలో చీడపీడల నివారణ, మొక్కల పెరుగుదలలో కీలక దశలు వివరించారు. ఏఓ విజయ భాస్కరరావు, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా దుర్గాదేవి జాతర



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- అమ్మవారికి ప్రత్యేక పూజలు



దుర్గాదేవి అమ్మవారు

జి.సిగడాం: మండలంలోని మధుపాం గ్రామంలో గల దుర్గాదేవి అమ్మవారి జాతర మహోత్సవాలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో గత మూడు రోజుల నుంచి ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. సుదూరు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక వసతులు కల్పించారు. ఈ ఉత్సవాల్లో వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక ఎస్ఐ రామారావు పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

రక్తదానం.. ప్రాణదానం



అదపాకలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం

లావేరు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జెడ్పీటీసీ మీసాల సీతన్నాయుడు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ అన్నారు. శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మండలంలోని అదపాక గ్రామంలో గురువారం సర్పంచ్ గొర్లె శశికళప్రభాకర్‌నాయుడు రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. 30 మంది రక్తదానం చేశారు. జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, మాజీ సర్పంచ్ నడిమింటి కుమారి, సీనియర్ నాయకులు గొర్లె ప్రభాకర్‌నాయుడు, కిల్లారి మధు, గంట్యాడ చినసూర్యనారాయణ, జగ్గు నరసయ్య, రిమ్స్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : కుటుంబ సభ్యులు మందలించడంతో పట్టణంలో ఓ యువతి అదృశ్యమైనట్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. యువతి సోదరి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చెత్త సేకరణలో అలసత్వం వద్దు



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామ్మోహనరావు

గార: ఇంటింటా చెత్త సేకరణలో అలసత్వం వద్దని ఎంపీడీఓ శిమ్మ రామ్మోహనరావు అన్నారు. గురువారం గొంటి సచివాలయ పరిధిలోని దీపావళిలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తడి చెత్త- పొడి చెత్త, వర్మీ కంపోస్టు తయారీ విధానం, అమ్మకాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలన్నింటికీ విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ శిమ్మ ధర్మరాజు, ఎంపీటీసీ కోట రామారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

అనాథల సేవకుడికి సత్కారం



చిన్నికృష్ణను సత్కరిస్తున్న అభ్యుదయ యువజన సంఘం సభ్యులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని లలిత అనాథ శరణాలయ నిర్వాహకుడు సువ్వారి చిన్నికృష్ణను మొగిలిపాడులో గురువారం సన్మానించారు. చిన్నికృష్ణ అనేక మంది అనాథలు, వృద్ధులకు ఆశ్రయం కల్పించడమే కాకుండా పలు అనాథ మృతదేహాలకు దహన సంస్కారాలు చేయించారు. ఈ నేపథ్యంలో అభ్యుదయ యువజన సంఘం ప్రతినిధులు వార్షిక కార్యక్రమంలో భాగంగా చిన్నికృష్ణ సేవలను కొనియాడి సత్కరించారు.

26న క్విజ్ పోటీలు

కంచిలి: మండలంలోని గోకర్ణపురంలో రిపబ్లిక్ డే పురస్కరించుకుని ఈ నెల 26న క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఈ పోటీలకు ఎటువంటి ఎంట్రీ ఫీజు లేదని, వివరాలకు 9701702826, 9493577544 నంబర్లను సంప్రదించాలని సూచించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ.7వేలు, రూ.5వేలు, రూ.3వేలు చొప్పున నగదు, షీల్డులు అందజేస్తామని పేర్కొన్నారు. ఎటువంటి వయో పరిమితి లేదు, జట్టుకు నలుగురు సభ్యులు మాత్రమే ఉండాలని తెలిపారు.

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు

నరసన్నపేట: ప్రభుత్వ రంగ సంస్థల్లో ఒకటైన ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఇది సరైంది కాదని, ఎల్ఐసీని బలోపేతం చేయాలని ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీధర్, ఆచారి కోరారు. జీవిత బీమా వ్యాపార జాతీయకరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఎల్ఐసీని ప్రైవేట్‌పరం చేయాలని చూస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

వేమన పద్యాలు ఆచరణీయం



శ్రీకాకుళం క్రైమ్ : వేమన చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎస్పీ జి.ఆర్.రాధిక



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : వేమన పద్యాల రూపంలో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. గురువారం వేమన జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ వి.నాగ మణికంఠ, అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, డీఎస్పీలు మహేంద్ర మాతే, వాసుదేవ్, ప్రసాదరావు, సీఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

భారతీయ తత్వవేత్త వేమన..

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భారతీయ తత్వవేత్త, కవి యోగి వేమన అని ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బల్లాడ హేమామాలిని, సంఘ జిల్లా అధ్యక్షుడు జనార్దనరెడ్డి అన్నారు. జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం కార్యాలయంలో యోగివేమన జయంతి ఘనంగా నిర్వహించారు. అనంతరం వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగివేమన పద్యాలు సరళమైన భాషలో ఉంటాయన్నారు. పండిత లోకానికే పరిమితమైన వేదాంతాన్ని అతి సామాన్య మానవునికి కూడా అందుబాటులో తెచ్చిన ఘనత వేమనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి దుక్క రాజశేఖర రెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ అలపాన త్రినాధరెడ్డి, సంఘ కోశాధికారి బాకి వేణుగోపాలరెడ్డి, అధికార ప్రతినిధి బోర సాయిరాం రెడ్డి, శ్రీకాకుళం పట్టణ మహిళా అధ్యక్షురాలు పడపాన సుగుణారెడ్డి, మాధవ రెడ్డి, రత్నకుమారి, గంట రమణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేమన జయంతి

ఎచ్చెర్ల: ధర్మవరంశాఖా గ్రంథాలయంలో గురువారం వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖర్ నివాళులర్పించారు. అందరికీ అర్థమయ్యేలా పద్యాలు రచించిన వ్యక్తి వేమన అని అన్నారు. తెలుగు భాషకు ప్రాధాన్యతను ఇచ్చి సాహిత్యాన్ని ప్రజలకు చేరువచేశారన్నారు. సహాయకుడు బి.సూర్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్న ఎస్ఈ దైవప్రసాద్

అరసవల్లి: స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయంతో పాటు టెక్కలి, పాలకొండ డివిజనల్ కార్యాలయాల్లో గురువారం విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. తొలిరోజు అభిప్రాయ సేకరణ సందర్భంగా టెక్కలికి చెందిన కె.రామకిషోర్, విశాఖపట్నం నుంచి ఏపీ ప్రజాసంఘాల జేఏసీ తరఫున అధ్యక్షుడు జె.టి.రామారావులు తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తెలియజేశారు. శుక్ర, శనివారాల్లో అభిప్రాయ సేకరణ కార్యక్రమాలు కొనసాగుతాయని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.దైవ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఈఈ బయ్యన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులే యజమానులు



హిరమండలం: మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

హిరమండలం: ఉపాధి హామీ వేతనదారులే యజమానులని జిల్లా డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. గురువారం మండలంలోని కొండరాగోలు గ్రామంలోని ముద్దాడ చెంచునాయుడు చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి వారికున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మూడు వారాలుగా పనిచేసిన పనులకు సంబంధించి వేతనాలు అందలేదని పీడీ దృష్టికి వేతనదారులు తీసుకువచ్చారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రూ.19 కోట్లు బకాయి ఉందని, త్వరలోనే వాటిని వేతనదారుల ఖాతాలో జమచేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతీ గ్రామంలో 200 మంది చొప్పున వేతనదారులకు పనులకు వెళ్లేలా చూడాల్సి బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. హిరమండలంలో 4,500 మందికి పైబడి వేతనదారులు పనిలో ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 23 నుంచి జిల్లాలోని 30 మండలాల పరిధిలోని 912 గ్రామాల్లో సుమారు లక్ష మంది పనిలో ఉండేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ఉపాధిలో రాష్ట్రంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏపీడీ రవి, జేఈ రవి కుమార్, క్లస్టర్ కో ఆర్డినేటర్ భాస్కర్, ఏపీఓ ఎ.శ్రీనివాసరావు, ఈసీ సంతోష్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

కొలతల మేరకు ఉపాధి పనులు చేపట్టాలి

ఎల్.ఎన్.పేట: ఉపాధి హామీ పథకం వేతనదారులు ప్రతీ రోజు కొలతల ప్రకారం పనిచేసి రోజుకు రూ.250 వేతనం పొందాలని డ్వామా పీడీ జి.వి. చిట్టిరాజు అన్నారు. మండలంలోని శ్యామలాపురం గ్రామం సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉదయం 7 గంటలకు పనిలోకి రావాలని వేతనదారులకు సూచించారు. రోజుకు ఆరు గంటలకు తక్కువ లేకుండా పని చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడేలా పనులు చేయాలన్నారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న అందరూ పనిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు. మార్చి ఆఖరు నాటికి 100 రోజులు పని కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి ఏపీఓ వి.శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

గడువు పెంచాలి

ఆమదాలవలస: ఈ నెల 11న జీఓ నంబర్ 7తో ఉత్తర్వులు విడుదల చేసిందని, ఈ నెల 20లోగా లాగిన్ అవ్వాలని ఆ జీఓలో పేర్కొందని, దీనిని పొడిగించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.జనార్దనరావు గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లందరూ వారి ఆధార్, సీఎఫ్ఎంఎస్ నంబర్లు అనుసంధానంతో ఈకేవైసీ లింక్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ జీఓలో పేర్కొందన్నారు. తక్కువ సమయంలో పెన్షనర్లు ఈ పని పూర్తి చేయలేరని అన్నారు. రాష్ట్రంలో లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారని, సర్వర్లు పనిచేయకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ సమస్యను పరిశీలించి పెద్ద మనస్సుతో కాల వ్యవధి పెంచాలని కోరారు. పెన్షనర్లు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో చాలామందికి ఈ విషయం ఇంకా తెలియక ఈకేవైసీ చేయించుకోలేదన్నారు.

కనీస మద్దతు ధరతో ధాన్యం సేకరణ



సోంపేటలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న పౌరసరఫరాల జిల్లా మేనేజర్ జయంతి

సోంపేట: జిల్లాలో కనీస మద్దతు ధరకు ఖరీఫ్ ధాన్యం సేకరణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ ఎం.జయంతి అన్నారు. సోంపేట మండలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను గురువారం పర్యవేక్షించి వ్యవసాయ శాఖ అధికారి బి.నరసింహమూర్తితో సమీక్షించారు. అనంతరం పలు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర పొందాలన్నారు. ఈ ఏడాది వరి దిగుబడులు ఎకరానికి 30 బస్తాల మేరకు వచ్చిన నేపథ్యంలో ఆ మేరకు కొనుగోలు చేసేందుకు మిల్లర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లు ఆడించి బియ్యం సకాలంలో అందించాలన్నారు.

నిర్వాసితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు

కొత్తూరు: వంశధార ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గూనభద్ర వద్ద నిర్మించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం 400 ఎకరాల భూమిని 460 మంది రైతుల వద్ద గతంలో సేకరించారు. వీరు ఉపాధిని కోల్పోయారని, వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. గూనభద్రలో గురువారం ప్రభావిత కుటుంబాలతో సమావేశం నిర్వహించారు. నిర్వాసితులు హైకోర్టులో కేసు వేయడంతో.. సర్వే చేయాలని కోర్టు ఆదేశించి ఏళ్లు కావస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు ప్రభావిత కుటుంబాలను గుర్తించలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని కోరారు. ప్రభావిత కుటుంబాల సమస్యలను పరిష్కారం కోసం ఈ నెల 20న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రతినిధి గంగరాపు ఈశ్వరమ్మ, సంఘం జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం, గూనభద్రకు చెందిన చింతాడ రాజారావు, వజ్రగడ్డ శంకరరావు, గూనాపు శంకరరావు పాల్గొన్నారు.